

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

లింగాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి సంజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రైతులు విత్తనాలు నాటేందుకు తొందర పడకూడదని చెప్పారు. వర్షాలు సరిపడా కురిసిన అనంతరమే విత్తనాలు పెట్టాలన్నారు. నాణ్యమైన విత్తనాలను లైసెన్సు ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి రశీదులు తప్పనిసరిగా పొందాలని చెప్పారు. విత్తనాలు మొలకెత్తక పోయినయిట్లతే రైతుల వద్ద రశీదులు ఉంటే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. రైతులు అధికారుల సూచనలు పాటించి పంట సాగు చేసి దిగుబడి సాధించాలని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి అనుమానాలు ఉన్నా అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు.

రైల్వేపాస్‌లు రెన్యూవల్ చేయాలి

కాగజ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల రైల్వే పాస్‌లను వెంటనే రెన్యూవల్ చేయాలని చైతన్య దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఖయ్యూం ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే చీఫ్ కమర్షియల్ అధికారి కైలాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖయ్యూం మాట్లాడుతూ రైలు ప్రయాణాల్లో దివ్యాంగులు రిజర్వేషన్‌లో టికెట్ కొనుగోలు చేస్తే రెన్యూవల్ పాస్ కాలేదని టికెట్ ఇవ్వటం లేదని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని నకోరారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం.. ఆరోగ్య భాగ్యం

- ఎన్‌ఎంఎన్‌ఎఫ్ పథకానికి రూపకల్పన
- జిల్లాలో 3వేల ఎకరాల్లో సాగు లక్ష్యం
- మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు
- ఎంపిక చేసిన రైతులకు శిక్షణ



ఆసిఫాబాద్‌రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్(ఎన్‌ఎంఎన్‌ఎఫ్) పథకాన్ని ప్రారంభించింది. దీని లక్ష్యం రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, సహజ వ్యవసాయ పద్ధతులను విస్తరించడంగా అధికారులు చెబుతున్నారు. భూసారాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ పథకం కింద సహజ వ్యవసాయ పద్ధతులను అవలంభించే రైతు లను ప్రోత్సహించడంతో పాటు సహజ వ్యవసాయం యొక్క పరిధిని పెంచడానికి ఆర్థిక సహాయం అందిం చనున్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని మూడువేల మంది రైతులకు ప్రయోజనం కలుగనుంది.

● జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో మొత్తం 4.4 లక్షల ఎకరాల్లో 1.39 లక్షల మంది రైతులు వివిధ పం టలు సాగు చేస్తున్నారు. వీరిలో ప్రకృతి సేద్యం కోసం 24 క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లష్టరుకు 125 మంది చొప్పున రైతులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 3వేల మంది రైతులను ఎంపిక చేయనున్నారు. మొదటి విడతలో 3వేల ఎకరా లను సాగు చేయడానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రకృతి సేద్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్‌ఎంఎన్‌ఎ ఫ్) పథకంలో భాగంగా రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వ డానికి ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం ఎన్‌జీఓల ద్వారా దరఖాస్తులను స్వీకరించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనికి సంబంధించి రైతుల భూముల నుంచి ఏఈవోలు మట్టి నమూనాలను కూ డా సేకరిస్తున్నారు.

● తక్కువ పెట్టుబడితో..

తక్కువ పెట్టుబడితో దిగుబడి సాధించవచ్చని కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్లు అధికా రులు చెబుతున్నారు. రసాయనికి ఎరువులు వాడకం తగ్గించడం వల్ల రైతులకు పెట్టుబడి మిగిలి లాభం కలిగే అవకాశం ఉంటుంది. ప్రకృతి సిద్ధంగా దొరికే జీవ సంబంధిత ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులు వినియోగించనున్నారు. దీంతో దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయాధి కారులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ప్రజలు పలు రకాల వ్యాధులు భారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి సిద్ధమైన పంటలను కొనుగోలు చేయాలని పలువురు భావిస్తున్నారు. దీంతో ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఎంపిక దశ కొనసాగుతోంది..

- మిలింద్ కుమార్, ఆసిఫాబాద్ ఏడీఏ



జిల్లాలో ప్రకృతి సేద్యం చేసే రైతుల ఎంపిక దశ కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన పథకం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వీటిని తీసుకో వడం వల్ల ప్రజలకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు తొలగిపోనున్నాయి. రైతులను ఎంపిక చేశాక శిక్షణ ఇచ్చి సాగుచేసేలా ప్రోత్సహిస్తాం.

పేద రైతులకు న్యాయం చేస్తాం


మాట్లాడుతున్న ఇక్బాల్ హుస్సేన్

సిర్పూర్(టి), మే 20 (ఆంధ్రజ్యోతి): చింతల మానేపల్లి మండలం దిందా, బండెపల్లి రిజర్వు ఫారెస్టులో తక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్న పేద రైతులకు న్యాయం చేస్తామని సిర్పూర్(టి) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ, అటవీ శాఖాధికారులతో కలిసి అన్ని కోణాల్లో సర్వే నిర్వహించామని అన్నారు. ఇందులో భాగంగా 16 కుటుంబాలు 20 నుంచి 40 ఎకరాల వరకు పోడు భూములను కబ్జా చేశాయని చెప్పారు. 44 కుటుంబాలు 10 నుంచి 20 ఎకరాల వరకు కలిగి ఉన్నారని అన్నారు. 60 కుటుంబాలు మొత్తం రిజర్వు ఫారెస్టు 1,500 ఎకరాల్లో భూములు కబ్జా చేసి పోడు సాగు చేస్తున్నారన్నారు. దీనిపై అన్ని కోణాల్లో విచారణ చేపడితే 60 కుటుంబాలు ఆర్థికంగా ఉన్నవారే ఉన్నారని విచారణలో వెల్లడైందన్నారు. ఆ భూములను తమ ఆధీనంలోకి తీసుకుంటు న్నామన్నారు. అలాగే ఈ కంపార్టుమెంట్‌లోనే 117 మంది రైతులు రెండు నుంచి ఎనిమిది ఎకరాల వరకు కబ్జా చేసి సాగు చేస్తున్నారని చెప్పారు. వీరు వెనకబడి ఉన్నారని, వారికి ఎలాంటి హాని కలిగించమని చెప్పారు. వారు వ్యవసాయం చేసుకోవచ్చన్నారు. 60 కుటుంబాలకు ఆధీనంలో ఉన్న 1,500 ఎకరాల భూమి వదలబో మని అన్నారు. మిగిలినా 117 మంది రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దన్నారు. పూర్తి సమగ్ర నివేదికలను సంబంధిత శాఖాధికారులకు సమర్పిం చామని తెలిపారు.

రైతులకు రశీదులు ఇవ్వాలి


మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కెరమెరి, మే 20 (ఆంధ్రజ్యోతి): పత్తి, కంది విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు రశీదులు ఇవ్వాలని ఎస్సై మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో విత్తన దుకాణం యజమానులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పత్తి, కంది విత్తనాలకు సంబంధించి రశీదులను రైతులకు తప్పకుండా ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయించినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో విత్తన దుకాణాల యజమా నులు రామకృష్ణ, యూసుఫ్, మున్నా, బుపేందర్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ శిక్షణ కేంద్రాల్లో ఫ్యాన్లు తిరగక ఎండ వేడిమితో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎండ వేడిమికి వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నందున కూలర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు డీహైడ్రేట్ కాకుండా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఉపాధ్యాయులందరికీ మాడ్యూల్స్ సకాలంలో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రీతి, జిల్లా కార్యదర్శి మహిపాల్, గంగాధర్, వామన్, గుణాకర్ పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ అడిషనల్ డీఆర్‌డీవో పీడీ రామకృష్ణ

సిర్పూర్(టి), మే 20 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కార్యాలయం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ అడిషనల్ డీఆర్‌డీవో పీడీ రామకృష్ణ అన్నారు. మండలంలోని టోంకిని, పారిగాం గ్రామాల్లో మంగళవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించకూడదని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ప్రభుత్వం అదనంగా అందజేస్తున్న రూ.500 వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం అన్నాజీ, ఏపీఎం దుర్గయ్య, ఏవో గిరీష్‌కుమార్, ఏఈవోలు నేహాత బసుం, శోభ, ఐకేపీ సిబ్బంది స్వప్న పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

సిర్పూరు(టి) , మే 20 (ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర చెక్ పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ ప్రభాకర్ అన్నారు. సిర్పూరు(టి) మండలంలోని వెంకట్రావుపేట, హుడ్కిలి జక్కాపూర్ చెక్ పోస్టులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. అక్రమంగా పశువులను తరిలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీరామానుజం, ఎస్సై కమలాకర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఏఎస్పీ ప్రభాకర్

పెంచికలపేటలో సామాజిక తనిఖీ

● గ్రామాల వారీగా నివేదికలు

పెంచికలపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రగతి నివేదిక సమావేశాన్ని నిర్వహించారు. సామాజిక బృందం ఎస్‌ఆర్పీ సదాశివ్‌చారి ఆధ్వర్యంలో గ్రామాల వారీగా నివేదికలను సభ ముందు ఉంచారు. మండల వ్యాప్తంగా 4,556 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 3,556 జాబ్ కార్డులలో 7,000 మంది పనులను వినియోగించుకున్నారు. రూ.3, 14,00,000 కూలీలకు అందించినట్లు తెలిపారు. ఇందులో కొన్ని పనులు సరిగా లేక పోవడంతో సంబంధిత పంచాయతీ కార్యద ర్శులకు, ఫీల్డ్ అధికారులకు శోకాజు నోటీసులు అందజేస్తూ 1,33,795 రికవరీ రాశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ఆంజనేయులు, ఎంపీడీవో ఆల్బర్ట్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంఈవో రమేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్థులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

వృత్యంతర శిక్షణ ప్రారంభం

బెజ్జూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ భూమేశ్వర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం వంటి భాష నైపుణ్యాలను చతుర్విద క్రియలైన గణిత సామర్థ్యాలు ప్రాథమిక స్థాయిలో పిల్లల్లో పెంపొందించుకోవడానికి శిక్షణ కార్యక్రమం ఉపాధ్యాయులకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూస్తూ గుణాత్మక విద్య అందించాలని సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభంలోగా బడి బయట ఉన్న పిల్లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాజంలో ఉపాధ్యాయులకు సముచిత గౌరవం ఉంటుందని ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా విధులకు హాజరవుతూ విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈ వో సునీత తదితరులు పాల్గొన్నారు.

సిర్పూరు(టి), (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వేణుగోపాల్ రావు అన్నారు. సిర్పూరు(టి) మండల కేంద్రంలోని కేజీబీవీపీలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని 87 మంది ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు ఈ నెల 25 వరకు గుణాత్మక విద్యపై ఉంటుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, శిక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను ఐదు రోజుల్లో పూర్తి చేయాలి

దహెగాం, మే 20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఐదు రోజుల్లో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండలంలోని హత్తిని, దహెగాం కల్వాడ, కుంచవెల్లి, చంద్రపల్లి, గిరివెల్లి, ఒడ్డుగూడ, లగ్గాం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హమాలీల సంఖ్యను పెంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కల్వాడ గ్రామంలో పలువురితో రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ ఇళ్లలో నిల్వ చేసిన ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు సమీపంలోనే ఉన్న వరి పొలాలను ఎప్పుడు వరి కోతలను పూర్తి చేస్తారని ప్రశ్నించారు. త్వరలో పూర్తి చేసి ధాన్యం కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాత్రి పగలు పశువులు వస్తున్నాయని పలువురు రైతులు కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. వాచ్‌మెన్‌ను నియమించాలని పీపీసీ ఇన్‌చార్జిలను ఆదేశించారు. నాణ్యమైన ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీసీవో రాథోడ్ బిక్కు, డీటీ లలత, ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ రాజ్‌కుమార్, శ్రీనివాస్, ఏఆర్ శ్యామూల్, ఏపీఎం చంద్రశేఖర్, సీఈవో నారాయణ, పీపీసీ ఇన్‌చార్జి జీవన్, నర్సింహా, సాయి, ఏఈఓ వంశీ, ఆనంద్, సుస్మీత పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ డేవిడ్

పెట్టుబడిదారులకు సంపద దోచి పెడుతున్న మోదీ



నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన, మే 20 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను పెట్టుబడిదారులకు ప్రధాని నరేంద్రమోదీ దోచి పెడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. రెబ్బెనలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంళవారం ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో అసమానతలు పెరుగుతున్నాయన్నారు. ఐదు శాతం జనాభా కలిగిన కార్పొరేట్ పెట్టుబడిదారులు, బడా వ్యాపారుల సంపద 70 శాతం పెరిగిందన్నారు. మరో వైపు పేద, మధ్యతరగతి కార్మిక వర్గం పెరుగుతున్న ధరలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఆదాయం తగ్గి, ఖర్చులు పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాచకొండ రమేష్, కార్యదర్శి దేవాజీ పాల్గొన్నారు.

యువత వ్యసనాల బారిన పడొద్దు

దహెగాం, మే 20 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాల బారిన పడొద్దని ఎస్సై విక్రమ్ అన్నారు. మండలంలోని గెర్రె గ్రామంలో యువకులకు మంగళవారం వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. వ్యసనాలకు దూరంగా చదువుపై దృష్టి సారించాలన్నారు. డయల్ 100, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై యువకులకు అవగాహన కల్పించారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని సూచించారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన

● పీఎంశ్రీ పథకంలో భాగంగా నిధులు మంజూరు



ఎంపికైన సిర్పూర్(టి) జడ్పీహెచ్ఎస్ పాఠశాల

సిర్పూర్(టి), మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం లక్షల రూపాయలను వెచ్చించి మారు మూల గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులకు విద్యాభివృద్ధితో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్న లక్ష్యంతో 'పీఎంశ్రీ' ఎస్ఎస్ఏ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. మొదటి సారిగా సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు రూ.13.20 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో సైన్స్ విద్యార్థులకు విజ్ఞాన విహార యాత్రలు, కంప్యూటర్, సీసీ కెమెరాల ఏర్పాటు, కిచెన్ గార్డ్, మొక్కలు నాటడం, పెయింటింగ్, క్రీడా సామాగ్రి తదితర అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ పాఠశా లల అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం చేపడు తోంది. దీంతో పాటు విద్యార్థు లకు స్కూల్ డే ఇతర సాంస్కృతిక కార్యక్ర మాలు ఈ పథకంలో చేపడుతు న్నారు. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వం దశల వారీగా ఐదేళ్ల వరకు నిధులు విడుదల చేసి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పీఎంశ్రీ పథకం లక్ష్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని మరిన్ని పాఠశాలలకు ఈ నిధులు మంజూరు కానున్నాయి. ఈ విషయంపై హెచ్‌ఎం సదాశివ్‌ను వివరణ కోరగా పీఎం శ్రీ నిధులతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు సమగ్ర విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.


జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసి ఆధునిక ల్యాబ్

రోగులకు మెరుగైన సేవలు

జోగేందర్, సామాజిక ఆసుపత్రి వైద్యుడు



ఆంధ్రజ్యోతి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

వైద్యుడు: రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మధ్య కాలంలో వంద నుంచి 150 మంది వరకు ఓపీ రోగులు వస్తున్నారు. ఇందులో ఈజీఎస్ కూలీలు, రైతులు ఎండలో వివిధ పనులకు వెళ్లే వారు వడదెబ్బకు గురై ప్రథమ చికిత్స పొందుతున్నారు.

ఆంధ్రజ్యోతి: ఎండ దెబ్బకు గరవకుండా ఏం చర్యలు తీసుకోవాలి?

వైద్యుడు: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం, సాయంత్రం బయటికి వెళ్లాలి. ఆ సమయంలోనూ వెంట ఓఆర్ఎస్ ద్రవం ఉంచుకోవాలి. ఇంట్లో నిమ్మరసం, మజ్జిగా తీసుకోవడం వల్ల ప్రయో జనం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రిలో సరిపడ సిబ్బంది ఉన్నారా?

వైద్యుడు: ఆసుపత్రిలో తొమ్మిది నెలల నుంచి ఫార్మసిస్టు పోస్టు ఖాళీగా ఉంది. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున సరిపడా మందులు, టీకా, వ్యాక్సిన్‌లు నిలువ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రిలో ఆక్సిజన్ సదుపాయం ఉందా?

వైద్యుడు: రెండేళ్ల క్రితం క్రితం ప్రభుత్వం ఆక్సిజన్ ప్లాంట్ మంజూరు చేసింది. దాని నిర్మాణం పూర్తయింది. కానీ ప్రారంభించక పోవడంతో అందుబాటులో లేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- సిర్పూర్(టి), ఆంధ్రజ్యోతి

ఆయిల్‌పామ్ కోతకు సిద్ధం



రెబ్బెనలో కోతకు సిద్ధంగా ఉన్న ఆయిల్‌పామ్ గెలలు

- జూన్ నుంచి గెలల కత్తిరింపు పనులు ప్రారంభం
- జిల్లాలో 1,320 ఎకరాల్లో సాగు

రెబ్బెన, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రయోగాత్మకంగా పండించిన ఆయిల్‌పామ్ దిగుబడి మరి కొన్ని రోజుల్లో చేతికందనుంది. నాలుగేళ్లుగా చెట్లను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న అన్నదాతకు ప్రతిఫలం దక్కనుంది. జిల్లాలో నాలుగేళ్ల క్రితం ఆయిల్‌పామ్ సాగుకు అడుగు పడింది. ప్రారంభంలో కొద్ది మంది మాత్రమే తోటల సాగుపై ఆసక్తి చూపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారులు కొన్ని మండలాల్లో ప్రయోగాత్మకంగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టారు. అవి ఏడాది నుంచి రైతులకు దిగుబడితో పాటు ఆదాయాన్ని అందిస్తున్నాయి. జూన్ నుంచి ఆయిల్‌పామ్ గెలలు కోసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు.

నాలుగేళ్ల క్రితం జిల్లా రైతులు ఆయిల్‌పామ్ తోటల సాగును ప్రారంభించారు. ఈ తరహా సాగుపై అవగాహన లేక పోవటం, సమీపంలోని జిల్లాలోను పంట లేక పోవడంతో స్థానిక రైతులు ప్రారంభంలో ఆసక్తి చూపలేదు. దీంతో ఉద్యాన శాఖ అధికారులు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు లాభాదాయకంగా ఉంటుందని వివరించారు.



రెబ్బెన మండలం దేవులగూడ శివారులో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్

53 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా..

దీంతో రెబ్బెన, చింతలమానేపల్లి, కాగజ్‌నగర్, పెంచికల్‌పేట మండలాకు చెందిన కొంత మంది ముందుకొచ్చారు. 53 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా ఆయిల్‌పామ్ సాగు ప్రారంభించారు. అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ చెట్లను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. నాలుగేళ్ల క్రితం అతి తక్కువ విస్తీర్ణంలో మొదలైన పంట సాగు ఇప్పుడు 1,320 ఎకరాలకు చేరింది. మొదటి మూడేళ్ల మొక్కల నిర్వహణతో పాటు అంతర పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు సైతం అందించింది. కొంత మేర రైతులు ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపుతున్నా అధికారులు నిర్ణయించిన లక్ష్యానికి అనుగుణంగా విస్తీర్ణం పెరుగడం లేదు. ఇప్పటికీ కొంత మంది రైతులకుకొన్ని అపోహలు ఉండడం సరైన నీటి వసతులు లేక పోవడంతో లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నారు.

ఈ ఏడాది నుంచి వచ్చే గెలలతో రైతులకు ఆదాయం వస్తుంది. జూన్‌లో కత్తిరింపులు పనులు మొదలు కానున్నాయి. రైతులతో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం మ్యాట్రిక్ సంస్థ గెలలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లిస్తుంది. ప్రస్తుతం ఒక్కో చెట్టుకు సుమారు 4 నుంచి 6 గెలలున్నాయి. మొదటి ఏడాది ఎకరానికి సుమారు రెండు టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం దిగుబడి తక్కువగా ఉన్నా క్రమంగా పెరుగుతుంది. సకాలంలో యాజమాన్య పద్ధతులు చేపడితే ఆయిల్‌పామ్ చెట్లు 6 నుంచి 7 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి ఎకరానికి 8 నుంచి 12 టన్నుల దిగుబడి అందిస్తాయి. ఒప్పందం ప్రకారం మ్యాట్రిక్స్ కంపెనీ కొనుగోలు చేసే రోజుకు మార్కెట్ ధరను రైతులకు చెల్లిస్తుంది. దీంతో పంట విక్రయించేందుకు రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పామ్ ధర రూ.20,800 వరకు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మొక్క నాటిన నాలుగో ఏడాది నుంచి 30 ఏళ్ల పాటు రైతులకు దిగుబడి రానుంది. ఒక్కసారి పెట్టుబడి పెడితే 30 ఏళ్ల పాటు రైతుకు ఆదాయం ఉంటుంది.

కొద్ది రోజుల్లో దిగుబడి రానుంది..

నదీం, ఉద్యాన శాఖ అధికారి



జిల్లాలో నాలుగేళ్ల క్రితం నాటిన ఆయిల్ పామ్ చెట్లు మరికొన్ని రోజుల్లో మొదటి దిగుబడిని అందించనున్నాయి. మొదటి ఏడాది ఎకరానికి సుమారు 2 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. చెట్లు ఆరేళ్ల వయస్సుకు చేరుకునే సరికి ఎకరానికి 8 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రైతు ఒక్కసారి మొక్క నాటితే 35 ఏళ్ల పాటు దిగుబడి రానుంది. సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభాలు ఉంటాయి.

రైతులు పంట మార్పిడి చేయాలి

వేమనపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడి చేయడం ద్వారా దిగుబడి బాగా వస్తుందని మండల వ్యవసాయాధికారి వీరన్న తెలిపారు. మంగళవారం వేమనపల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సౌకర్యం ఉన్న రైతులు ఆయిల్‌ఫాం పంటలను సాగు చేయాలన్నారు. సకాలంలో దుక్కిదున్నుకుని విత్తనాలు వేసుకోవాలని సూచించారు. అలాగే రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేయ వద్దని, లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. సేంద్రీయ ఎరువులను వాడాలని, రసాయన ఎరువులతో భూసారం దెబ్బతింటుందని తెలిపారు. సమావేశంలో ఏఈవోలు హెప్సిబా, రుక్సార్ సుల్తానా , రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ

తాండూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చలాపూర్, రేచిని, తాండూర్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మండల తహసీల్దార్ జ్యోత్స్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుతామని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, రైతులు వదంతులు నమ్మకుండా ధైర్యంగా ఉండాలన్నారు. ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసేందుకు కూలీల సంఖ్యను పెంచాలని నిర్వహకులకు సూచించారు. ధాన్యం కొన్న రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాల తెలిపారు. ఈ మేరకు రశీదు అందించాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

కుమారులు పట్టించుకోవడం లేదని పోలీసులకు ఫిర్యాదు



వృద్ధురాలితో మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

భీమిని, మే 20 (ఆంధ్రజ్యోతి): కుమారులు, కోడళ్లు తమ ఆస్తులు గుంజుకొని తమకు అన్నం పెట్టడం లేదని భీమిని మండలం మల్లీడి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు పులగం రామయ్య భూమక్కలు పోలీసులను ఆశ్రయించారు. అస్తి తీసుకోని అన్నం పెట్టని కుమారులపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం తాండూర్ సీఐ కుమారస్వామి గ్రామానికి చేరుకోని ఆదరణ చేయని కుమారులతో మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామయ్య భూమక్క దంపతులకు రాజయ్య, భూమయ్య, తిరుపతి, శ్రీనివాస్, సతీష్‌లను ఐదుగురు కుమారులు ఉన్నారు. వీరందరూ తల్లిదండ్రుల ఆస్తులు తీసుకోని రెండు సంవత్సరాలుగా వారి బాగోగులు చూడకుండా ఉన్నారంటూ ఈ నెల 19 న పులగం రామయ్య తాండూర్ సీఐకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంటనే స్పందించి మల్లీడి గ్రామానికి చేరుకోని కుమారులను అందరినీ మల్లీడి గ్రామంలో వృద్ధుల ఇంటి వద్దకు పిలిపించారు. తల్లి దండ్రులను చేరదీయక పోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కుమారులను సీఐ హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై విజయ్ కుమార్ ఉన్నారు.

అక్రమ కేసును ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు సులవ జనార్దన్

జన్నారం, మే 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్‌పై అక్రమ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులవ జనార్దన్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 నెలల క్రితం జరిగిన ఘట నపై ఇప్పుడు భుక్యానాయక్‌పై కేసు నమోదు చేయడం కక్షసాధింపు చర్య అన్నారు. అదే విధంగా అధికార పార్టీ 17 నెలలు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరిచిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని, అకాల వర్షాలతో ఆరుగాలం కష్టపడి పండించే రైతు నష్టపోతుంటే పట్టించుకోవడం లేదన్నారు సమావేశంలో మండల నాయకులు, తాజా మాజీ ప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఉచ్చు పెట్టి పులిని చంపేశారు

- అనుమానితులను విచారిస్తున్నాం
- వివరాలు వెల్లడించిన ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్(ఎఫ్‌డీపీటీ) శాంతారాం



మాట్లాడుతున్న ఎఫ్‌డీపీటీ శాంతారాం, పాల్గొన్న అటవీశాఖ సిబ్బంది

కాగజ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): పెంచికల్‌పేట మండలం నల్లకుంటలో ఈ నెల 14న విద్యుత్ వైర్లతో ఉచ్చు పెట్టి పులిని హతమార్చిన కేసులో పలువురిని పట్టుకున్నామని ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్(ఎఫ్‌డీటీపీ) శాంతారాం అన్నారు. కాగజ్‌నగర్ అటవీ సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెంచికలపేట మండలం ఎల్లూరు అటవీ ప్రాంతంలోని నల్లకుంట సమీపంలో ఈ నెల 16న వన్యప్రాణిని ఖననం చేసినట్టు ప్రచారం జరిగిందని చెప్పారు. తామే స్వయంగా వెళ్లి పరిశీలించి విద్యుత్ వైర్ల ఉచ్చుకు పెద్దపులి మృతి చెందినట్లు గుర్తించామని తెలిపారు. వన్యప్రాణులను చంపే ముఠా ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు చెప్పారు. ఈ నెల 13 వరకు సీసీ కెమెరాలకు చిక్కిన పెద్దపులి సాయంత్రం నుంచి కన్పించలేదన్నారు. దీనిపై పక్కాగా ట్రాకర్స్ సిబ్బంది పరిశీలించారని తెలిపారు. ఈ నెల 14న విద్యుత్‌వైర్లకు ఉచ్చు పెట్టిన పులిని చంపేసినట్టు తేలిందన్నారు. మృతి చెందినది ఎనిమిదేళ్ల వయస్సు గల ఆడ పులిగా గుర్తించామని తెలిపారు. పులిని హత్య చేసిన కేసులో పలువురు అనుమాని తులను విచారించామని తెలిపారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారు పులిని చంపినట్టు ఒప్పుకున్నట్టు తెలిపారు. చర్మాన్ని, పులి గోళ్లను దహెగాం మండలం రాస్పెల్లిలో పులి చర్మాన్ని, గోళ్లను పాతి పెట్టినట్టు తెలుపటంతో సోమవారం వెళ్లి వారు సూచించిన స్థలం వద్ద తవ్వగా పులి చర్మం, గోళ్లు లభించినట్టు తెలిపారు. ఈ సంఘటనలో ఇంకెంత మంది ఉన్నారు...? ఈ ముఠా ఎంత మేర సంబంధాలున్నాయనే కోణంలో పరిశీలిస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే వీరి వివరాలు వెల్లడిస్తామన్నారు. మహారాష్ట్ర నుంచి రాకపోకలు సాగిస్తున్న పులుల విషయంలో సిబ్బంది మానిటరింగ్ చేస్తున్నారని చెప్పారు. రెవెన్యూ ప్రాంతంలో పులి మృతి చెందినట్టు వివరించారు. పులి మృతి విషయంలో తమ సిబ్బంది నిర్లక్ష్యం లేదని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నీ అనుమానాలే..?

కాగా పెద్దపులి మృతి చెందిన కేసులో అన్నీ అనుమానాలే కన్పిస్తున్నాయి. మంగళవారం ఎఫ్‌డీపీటీ శాంధారాం వివరాలను వెల్లడించిన అంశాల్లోనే స్పష్టత లేని పరిస్థితి ఉంది. పులిని హత్య చేసిన వారి వివరాల పేర్లు పూర్తిగా ప్రకటించలేదు..? పలువురు ఉన్నారంటూ పేర్కొనడం అన్నీ అనుమానాలకే దారి తీస్తోంది. అలాగే పులి ఈ నెల 13 వరకు సీసీ ట్రాక్‌లో చిక్కినప్పటికీ 14 నుంచి మిస్సింగ్ అయినప్పటికీ ఎందుకు దృష్టి సారించలేదు..? అటవీ శాఖ పరిధిలో చని పోలేదని రెవిన్యూ పరిధిలో హతమైనట్టు పేర్కొనడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పులి భద్రత విషయంలో ఇప్పుడు మంచిర్యాలలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎఫ్‌డీటీపీ ప్రకటించటం గమనార్హం.

కేంద్ర విధానాలతో కార్మికులకు ఇబ్బందులు

ఆసిఫాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో కార్మికులు, రైతులు ఇబ్బందులు పడుతారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని చెప్పారు. వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజేందర్, కృష్ణమాచారి, శ్రీకాంత్, ప్రభాకర్, కోటయ్య, పద్మ, సమ్మయ్య, రాజు, తిరుపతి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయిస్తున్న ఎస్సై శ్యామ్‌పటేల్

వేమనపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యామ్‌పటేల్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు మంగళవారం మరమ్మతులు చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలు తగ్గుముఖం పడుతున్నాయని తెలిపారు.

సింగరేణి సమాచారం

నూతన బదిలీ విధానాన్ని రద్దు చేయాలి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాసిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం విడుదల చేసిన నూతన బదిలీ విధానాన్ని రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కాసిపేట గనిపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయుసీ మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య మాట్లాడుతూ కార్మికుల మనోభావాలను దె బ్బతీసే విధంగా సింగరేణి తీసుకొచ్చిన కొత్త బదిలీ విధానాన్ని వెంటనే రద్దు చేయాల న్నారు. ఉద్యోగి జీవితంలో కేవలం రెండు సార్లు మాత్రమే రెక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం ఇచ్చారని చెప్పారు. పర్మినెంట్ ఉద్యోగి బదిలీ కోసం కనీసం మూడేళ్ల పాటు సేవ, కీలకపోస్టుల్లో ఇప్పటికే పని చేసిన ఉద్యోగులను మళ్లీ నియమించకూడదని తదితర నిబంధనలు సింగరేణి చరిత్రలో ఎప్పుడు రాలేదని చెప్పారు. ఈ నిబంధనలు ఉద్యోగ భద్రతపై ప్రతికూల ప్రభావం చూపుతాయని చెప్పారు. సంస్థ బొగ్గు ఉత్పత్తిపైకూడ ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ గని మేనేజర్ భూ శంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బన్న లక్ష్మణ్‌దాసు, శనిగారపు రవీందర్, సోగాల కన్నయ్య, కనుకుంట దినేష్, సంపత్, శ్రీకాంత్, రాజుకుమార్, అలీ, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం తీసుకొచ్చిన నూతన బదిలీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏరియా సెక్రటరీ బత్తుల వేణు, పిట్ కార్యదర్శి రాములు మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కొత్త బదిలీ విదానం కోసం యాజమాన్యం విడుదల చేసిన ఉత్తర్వులు కార్మికులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు. ఒక కార్మికుడు, ఒక ఉద్యోగి జీవితంలో కేవలం రెండు సార్లు మాత్రమే ఇష్టంతో కూడిన బదిలీని చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఉద్యోగుల్లో మానసిక ఒత్తిడిని కలుగజేసేందుకు యజమాన్యం తీసుకొచ్చిన నిర్ణయం సరికాదన్నారు. వెంటనే ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎస్‌పీ ఇన్‌చార్జి ఇంజనీర్ జాకీర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో ఐఎన్‌టీయుసీ నాయకులు మధుబాబు, కోల చంద్రమోహన్, జైరాజ్, అల్లం ప్రభాకర్, కాంపెల్లి తిరుపతి, మంతెన గోపి, జాడి లలిత, పత్తి రాజిరెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

సాగు నీరు పారేదెలా..?

- అస్తవ్యస్తంగా బోలుచెరువు
- పెరిగిన పిచ్చి మొక్కలు
- అన్నదాతల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



పిచ్చి మొక్కలతో నిండిన బోలుచెరువు

బెజ్జూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసే పంట పొలాలకు సాగునీరు అందించే చెరువుల మరమ్మతులపై పట్టింపు లేక ఆయకట్టు రైతులకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. చెరువులో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం సమీపంలోని బోలుచెరువు పూర్తిగా పూడికతో నిండి పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఆయకట్టు కింద రైతుల పొలాలకు సాగునీరు అందడం లేదు. చెరువు పూర్తిగా పిచ్చి మొక్కలతో అడవులను తలపిస్తోంది. ఆయకట్టు చివరి రైతులకు నీరు అందే పరిస్థితి కనిపించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. బోలు చెరువు మత్తడి కూడా శిథిలావస్థకు చేరడంతో దాని మరమ్మత్తులు కూడా చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు.

చెత్త పేరుకపోయి..

మండల కేంద్రంసమీపంలోని బోలుచెరువులో చెత్త పేరుకపోయి చెరువు నిండా పిచ్చి మొక్కలు పెరగడంతో నీరు నిల్వ లేకుండా పోతోంది. చెరువు ఆయకట్టు కింద సుమారు 100ఎకరాల్లో పంటలకు సాగునీరు అందుతుండగా ప్రస్తుతం 50ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని రైతులు తెలుపుతున్నారు. మరో 15 రోజుల్లో ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్న రైతులు ఆందోళనలో ఉన్నారు. చెరువుకు మరమ్మత్తులు చేపట్టినట్లయితే ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే చెరువు మరమ్మత్తులు చేపడితే సాగునీటికి ఇబ్బందులు తలెత్తవని, ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు తెలుపుతున్నారు. చెరువులో పిచ్చిమొక్కలు నిండటంతో వర్షపు నీరంతా నిల్వ లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. చెరువులో పూర్తిస్థాయిలో పూడిక తొలగించి పిచ్చిమొక్కలు తొలగిస్తే పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంటుందని రైతులు తెలుపుతున్నారు.

మరమ్మతులు కరువు..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంటలసాగులో ఇబ్బందులు లేకుండా ఉండి వ్యవసాయ రంగంలో ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చెరువుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెబుతున్నా ఆచరణలో అమలు కాక రైతులకు అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలానికి ముందే చెరువుల స్థితిగతులను నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేసి మరమ్మత్తులు అవసరమున్న చెరువులను గుర్తించి వాటికి అభివృద్ధి చేయాలని ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో రైతులు సాగు చేసే పంట పొలాలకు నీరందక పంట దిగుబడి రాక అప్పుల పాలవుతున్నారు. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న బోలు చెరువుపై అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆర్థకంగా దిగజారుతున్నారు. గతంలో పూర్తిస్థాయిలో సాగునీరు అందించిన చెరువు ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోలుచెరువు మరమ్మత్తులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన మత్తడి

మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు

విజయ్ కుమార్, ఎస్సై, భీమిని



భీమిని, మే 20 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని భీమిని ఎస్సై విజయ్ కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : యువకులు ఎక్కువగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఎస్సై : ప్రతీ రోజూ డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న యువకులు పట్టుబడితే జరిమానాలు వేసి కోర్టుల్లో హాజరు పరుస్తాము. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ యువతకు, పెద్దలకు అవగాహన కల్పిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాలు తగ్గేందుకు మీరు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు ?

ఎస్సై : ప్రతీ ఒక్కరికీ ప్రమాదాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ప్రతీ ఒక్క వాహన దారుడికి లైసెన్స్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాము. ముఖ్యంగా చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : యువతకు మీరిచ్చే సలహా ఏంటి ?

ఎస్సై : క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోకుండా సమస్యలు ఉంటే పెద్దవారికి, పోలీసుల దృష్టికి తీసుకొని రావాలి. మద్యం, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడవద్దు. ఏవైనా ఇబ్బందులు ఉంటే ఇరువురితో చర్చించి కౌన్సిలింగ్ ఇస్తాం.

ఆంధ్రజ్యోతి : శాంతి భద్రతల రక్షణకు ముందస్తు చర్యలు చేపడుతున్నారా ?

ఎస్సై : గ్రామాల్లో శాంతి భద్రతల రక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాము. చిన్న చిన్న తగాదాలు, గొడవలు జరిగితే రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచిస్తున్నాం. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే సందేశాలు, మత విద్వేశాల సందేవాలు పెడితే చర్యలు తీసుకుంటాం.

ఆర్థిక సహాయం

దండేపల్లి,మే 20(ఆంధ్రజ్యోతి): మండలం చెల్కగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పలగూడ చెందిన తుమరం రామస్వామి కుటుంబానికి చెల్కగూడ చెందిన పత్తి పాక శ్రీనివాస్ దాతల సహకారంతో నిత్యావసర సరుకులను అందజేశారు. తిరుపతి, కొట్టె సత్తయ్య 25 కేజీల బియ్యం అందజేశారు. రామస్వామి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

తహసీల్దార్ బదిలీ

దండేపల్లి,మే 20(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సంధ్యారాణి బదిలీపై వేమనపల్లి మండలానికి వెళ్లనున్నారు. ఆమెస్థానంలో కలెక్టరేట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్ దండేపల్లికి రానున్నారు.

పంట రుణాల షెడ్యూలు ఖరారు

నెన్నెల, మే 20(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ పంట రుణాలు అందించేందుకు గ్రామాల వారిగా షెడ్యూలు ఖరారు చేసినట్టు తెలంగాణ గ్రామీణ బ్యాంకు నెన్నెల శాఖ మేనేజర్ ఎం. వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 21న నెన్నెల, బొప్పారం, కొత్తగూడెం, 22న నెన్నెల, 26న నందులపల్లి, 27న జోగాపూర్, 28న ఘన్‌పూర్, జోగా పూర్, 29, 30న గొళ్లపల్లి, జూన్ 2, 3న మైలారం, 4, 5న మన్నెగూడం, కూర్మ గూడెం, లంబాడితండా, 6, 9న ఖర్జి, జంగాల్‌పేట, దమ్మిరెడ్డిపేట, 10, 11న కోనంపేట, 12, 13న కుశ్నపల్లి గ్రామాల రైతులకు రుణాలు ఇస్తామన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, 1బీ, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పంటరుణం పాసుబుక్కుల జిరాక్సు కాపీలు, ఒక పాస్‌పోర్టు సైజు ఫోటో, రెవెన్యూ స్టాంపుతో బ్యాంకులో సంప్రదించాలని కోరారు.

పశువుల వాహనాలు పట్టివేత

కోటపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పారుపెల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం తెల్లవారుజామున అక్రమంగా తరలుతున్న పశువుల వాహనాలను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని దరూర్ బజార్ నుంచి నిజామా బాద్‌కు తరలిస్తున్న డీసీఎం ఐచర్ వ్యాన్‌ను పట్టుకున్నామన్నారు. ఇందులో 25 ఎద్దులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే మరో బొలేరో వాహనంలో నాలుగు ఎద్దులతో పాటు రెండు ఆవులు మండలంలోని జనగామ నుంచి ధర్మారం మండలానికి తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

వాహనాల్లోని పశువులను గోశాలకు తరలించామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



గోదావరికి చీరె సారె సమర్పిస్తున్న భక్తులు





పూజలు చేస్తున్న భక్తులు



నదిలో పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు

సరస్వతి.. నమోస్తుతే

- పుష్కరాలకు కొనసాగుతున్న భక్తుల రద్దీ
- ఆరో రోజు 50 వేల మంది పుణ్యస్నానాలు..
- నదిలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మోహరింపు...

భూపాలపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఎండలను సైతం లెక్కచేయకుండా జనం తరలివచ్చి సరస్వతి అంతర్వాహినిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల్లో ఆరో రోజైన మంగళవారం దాదాపు 50 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీ శ్వర స్వామిని దర్శించుకున్నారు. రెండు రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఉదయం 12 గంటల లోపు, సాయం త్రం నాలుగు గంటల తర్వాత కాళేశ్వర క్షేత్రానికి తరలి వచ్చి పుష్కరస్నానాలు చేశారు. మూడు రోజులపాటు పోటెత్తిన భక్తుల సంఖ్య రెండు రోజుల్లో కొంత తగ్గినప్పటికీ భక్తులు సెంటిమెంట్ ప్రకారం పుణ్య స్నానాలకు రాలేదని అధికారులు భావిస్తున్నారు.



మంగళవారం అష్టమి కావడంతో సాధారణంగానే ఇక్కడ పిండ ప్రదాన కార్యక్రమాలను నిలిపివేస్తారు. గురువారం నుంచి భక్తుల సంఖ్య మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు గత మూడు రోజుల్లో ఉత్పన్నమైన సమస్యలను పునరావృతం కాకుండా చూసేందుకు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారిని మరింత విస్తరించి రోలింగ్ చేశారు. భక్తులరాక వల్ల రోడ్డు పై దుమ్మురేగకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లను చల్లు తూ క్యూరింగ్ చేస్తున్నారు. మంగళవారం పుష్కరాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎండ వేడి నుంచి రక్షణ కలిగించేలా చలువ పం దిళ్లు, తాగునీరు, ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపి ణీని జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. కలెక్టర్ రాహుల్ శర్మ పుష్కరాలు జరుగుతున్న ఘాట్లలో తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించారు. పుష్కరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడడం కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను సమీక్షిస్తూ పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు అందించారు.

మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి సృజన, ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజీ తరుణ్ జోషి తదితరులు నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించడం కోసం అధికార యంత్రాంగం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్), సింగరేణి రెస్క్యూ బృందాలను, గజ ఈతగాళ్లను పుష్కర ఘాట్‌లో మోహరించారు.

రాజీవ్ యువ వికాసంలో యువతకు పెద్దపీట

- భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం
- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్
- భీమారంలో భూ భారతి అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

భీమారం, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో చెన్నూరు నియోజకవర్గ యువతకు పెద్దపీట వేస్తున్నామని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ పేర్కొన్నారు. మంగళవారం భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. చెన్నూర్ ప్రాంతంలోని యువతకు రాజీవ్ యువ వికాస పథకంలో రాష్ట్రంలోనే అత్యధిక యూనిట్లను తీసుకువచ్చి యువతీ, యువకుల్లో జీవితాలలో వెలుగులు నింపుతానని పేర్కొన్నారు. భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గత ప్రభుత్వం కేవలం భూ దందాల కోసమే ధరణి చట్టాన్ని తీసుకువచ్చిందని, కానీ ప్రజలు, రైతులు మేలు జరగలేదన్నారు. రానున్న రోజుల్లో భూ భారతి కార్డులు అందజేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని పేర్కొన్నారు. భీమారం మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 21లో మోఖాపై ఉన్నవారికి పట్టాలు లేవని, పట్టాలున్నవారు మోఖాపై లేరని, అందరికీ న్యాయం చేస్తామన్నారు. జిల్లాలోనే భీమారం మండలం భూ భారతి కింద పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక కావడం గమనార్హమని, దీనివల్ల రైతుల సమస్యలు తీరనున్నాయన్నారు. గిరిజన జీవితాల్లో ఆనందం నింపేందుకు ప్రభు త్వం గిరి వికాసం కార్యక్రమం క్రింద గిరిజన భూములలో బోర్లు వేయించి సోలార్ విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ, తాను గతంలో చెన్నూర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినప్పుడు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులే ఇప్పటికీ దర్శనమిస్తున్నాయని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధిని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, మండలవ్యా ప్తంగా 2200 పైచిలుకు దరఖాస్తులు వివిధ గ్రామాల నుంచి గ్రామ సభల ద్వారా అధికారులు స్వీకరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఆర్‌డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ ఇలా ఐదంచెల వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈ విధానంలో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు.

● భూ భారతి అవగాహన సదస్సులో భీమారం మండలానికి చెందిన పలువురు రైతులు తమ భూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్‌డీవో శ్రీనివాస్ రావు, భీమారం, జైపూర్, చెన్నూర్ తహసీల్దార్లు సదానందం, వనజారెడ్డి, మల్లికార్జున్, కాంగ్రెస్ జిల్లా, మండల స్థాయి నాయకులు చేకూర్తి సత్యనారాయణ రెడ్డి, పోడేటి రవి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం

జైపూర్ : మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులో పాల్గొనడానికి మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వచ్చారు. హెలికాప్టర్‌లో వచ్చిన మంత్రి ఎస్టీపీపీలోని హెలిప్యాడ్ వద్ద దిగగా ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, కలెక్టర్ కు మార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, డీఆర్ డీవో కిషన్, ఆర్డీవో శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం రాజ్ కుమార్ మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం భీమారం మండలానికి బయలుదేరి వెళ్లారు.



మంత్రి పొంగులేటికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వివేక్

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సత్యం

భీమారం, మే 20 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, నిర్మాణానికి నిధులు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగిళి సంపత్‌రెడ్డి కోరారు. మంగళ వారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, పదేళ్లుగా జిల్లాలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ జూన్‌లో అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

జన్నారం, మే20(ఆంధ్రజ్యోతి): జన్నారం మండలలోని రాంపూర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం దండేపల్లి(సీఎఫ్ఎల్) ఆధ్వర్యంలో ఎంజీఎస్ఆర్ ఈజీఎస్ వారు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ తాళ్లపేట్ బ్రాంచి మేనేజర్ శ్రీనాథ్, దండేపల్లి కౌన్సిలర్ హరీశ్ మాట్లాడుతూ బ్యాంక్‌లోని ఖాతాలు, ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్ కేటాయింపులు, డిజిటల్ ఖాతాలు రకాలు, రుణ సౌకర్యాలతో కడిన అదనపు ప్రయోజనాలు, బీమా, పెన్షన్ ఉత్పత్తులపై వివరించారు. మరణించిన ఖాతాదారుల నామిని ప్రాముఖ్యతను, డాక్యుమెంట్ల సబ్మిషన్, ఏటీఎం ఉపయోగం ద్వారా కలిగే ప్రయోజనాలపై వివరించారు.

ఇరిగేషన్ అధికారుల సర్వే

లక్షెట్టిపేట, మే 20(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఇటిక్యాల చెరువుతో పాటు లక్షెట్టిపేట ఊర చెరువు ఎఫ్‌టీఎల్ సర్వేను ఇరిగేషన్ శాఖ అధికారులు మంగళవారం చేపట్టారు. చెరువు విస్తీర్ణం మొత్తం 67ఎకరాలు ఉండగా కొద్ది రోజులుగా అటు చెరువు ప్రాంత పట్టాదారులతో పాటు గంగాపుత్ర సంఘం సభ్యులు, చెరువు పరిరక్షణ సమితి సభ్యులు చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులు వేయాలని అధికారుల చుట్టు తిరగడంతో ఎట్టకేలకు చెరువుకు సంభందించి ఎఫ్‌టీఎల్ పెగ్ మార్కింగ్‌ను గుర్తించినట్లు ఆశాఖ జేఈ ప్రణీత్ ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఈసందర్భంగా మీడియా జేఈని పూర్తి వివరణ కోరగా ప్రస్తుతం గుర్తించిన పెగ్ మార్కింగ్ నివేదికను సంభందిత అధికారులకు అందజేస్తామని మార్కింగ్‌లోని సర్వే నంబర్లను రెవెన్యూ అధికారులు తెలిపన అనంతరం మ్యాప్ తయారు చేస్తామన్నారు. ఈప్రక్రియ పూర్తి అయ్యేందుకు సుమారు నాలుగు నుంచి ఐదు రోజులు పడుతుందని మ్యాప్ పూర్తి అయిన తర్వాత అధికారికంగా మరో ప్రకటన విడుదల చేసి పూర్తి వివరాలు అందజేస్తామన్నారు.

పార్టీ కోసం పని చేసే వారికి ప్రాధాన్యం

మందమర్రి టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పని చేసే వారికి పార్టీలో ప్రాధాన్యతతో పాటు పోస్టులు లభిస్తాయని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ రాఘవరెడ్డి, సెక్రెటరీ రాంగోపాల్ తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయం వద్ద ఎన్నికల ప్రక్రియకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు వారి వారి పదవుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాయకులు నోముల ఉపేందర్ గౌడ్, తదిత రులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతి

జైపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విషయంలో ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందించారు. మంగళవారం జైపూర్ పవర్ ప్లాంట్ వద్ద మంత్రిని కలిసిన దళిత సంఘాల నాయకులు ఇటీవల కొన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపీ గడ్డం వంశీకృష్ణను పిలవడం లేదని, ప్రొటోకాల్ పాటించకుండా అవమానపరుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైపూర్ మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, మాజీ సర్పంచు పండగ రాజన్న, మాల మహానాడు చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శీలం వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రామకృష్ణాపూర్, మే20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామాలయం చౌరస్తాలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రాము, రాజుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కానరాని తునికాకు సేకరణ

(5వ పేజీ తరువాయి)

రావడంతో బీడీ ఆకులకు మార్కెట్‌లో ఆదరణ తగ్గిపోయింది. ఆదివాసీల ఉపాధిపై పుర్రెగుర్తు వెక్కిరిస్తుంది. మంచిర్యాల జిల్లాలో 61వేల ఆదివాసీ జనాభ ఉండగా 80శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో నివాసముంటున్నారు. ఎక్కువ మంది వ్యవసాయం, అటవీ అధారిత ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆదివాసీ గిరిజనులకు వేసవిలో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు కల్పించాలని ఆదివాసీ సంఘాలు కోరుతున్నాయి.

సీజన్‌లో ఐదువేలకు పైగా సంపాదించుకునేవాళ్లం..

తుర్సుబాయి, లక్ష్మీపూర్



ఆకుల సీజన్ వచ్చిందంటే ఒక్కొక్కరు ఐదువేలకు తగ్గకుండా సంపాదించుకునేవాళ్లం. కాని మూడేళ్ల నుంచి ఆకులు కోస్తలేరు. ఉదయం అడ వులకు వెళ్లి ఎండకు దొరకకుండానే ఇంటికి వచ్చేవాళ్లం. ఇంటిలోని వా రందరూ ఆడుతుపాడుతూ పని చేసిన ఐదువేలు వస్తుండేవి. ఆ తరువాత గవర్నమెంటువాళ్లు బోనస్ ఇస్తుండే. గిరిజనులకు వేసవి సీజన్‌లో చేతినిండా పని దొరుకుతుండేది. ఇప్పుడు ఎలాంటి పని దొరుకుత లేదు.

గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు...

సుభాష్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, లక్షెట్టిపేట



తునికాకు సేకరణను కొనుగోలు కోసం గుత్తెదారులు ఆసక్తి చూపడం లేదు. అలాగే అడవుల్లో తునికాకు కొరత కూడ ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. దీంతో ప్రతి ఏటా తునికాకు సేకరణ తగ్గుతూ వస్తోంది. అవసరం ఉన్న చోట తునికాకు యూనిట్లను ఏర్పాటు చేసి తునికాకును కొనుగోలు చేస్తున్నాం. అందరికీ ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. లక్షెట్టిపేట రేంజ్ పరిధిలో హాజీపూర్‌లో తునికాకు యూనిట్ ఏర్పాటు చేశాం. నిర్దేశించిన స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యాన్ని చేరేందుకు తునికాకు కొనుగోలు చేస్తున్నాం.

బండెనక బండి కట్టి...



దండేపల్లిలో ఎడ్ల బండ్లలో తీసుకొస్తున్న పాలపొరక

దండేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): బండెనక బండి కట్టి.. 16బండ్లు కట్టి.. ఏ బండ్లె పోతవు కొడకో నైజం సర్కరోడో.. అనే గీతం నేటికి చెరగని జ్ఞాపకం. ఈ చిత్రాన్ని చూస్తే ఆ పాట కచ్చితంగా గుర్తుకొస్తుంది. కానీ ఓ వివాహకార్యక్రమంలో భాగంగా దండేపల్లి గ్రామంలో సాంప్రదాయం ప్రకారం ఇలా పాలపొరక తీసుసొస్తున్న దృశ్యం ఆకట్టుకుంది. పెళ్లి వేడుకల కోసం ఒక రోజు ముందు ఎడ్ల బండ్ల ద్వారా పాలపొరక తీసుకరావడం అనావాయితీగా వస్తోంది. ట్రాక్టర్లు వినియోగం వచ్చాక ఎడ్ల బండ్ల వాడకం తగ్గిన తరుణంలో ఇంకా పాత సంప్రదాయాన్ని కొనగించడం విశేషమనే చెప్పాలి.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దగ్ధం

చెన్నూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన బోగె శంకర్ అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. మంగళవారం ఓత్కుపల్లి సమీపంలో చేను దున్నుతుండగా డీజిల్ అయిపోయింది. డ్రైవర్ వెళ్లి డీజిల్ తీసుకువచ్చే సరికి ట్రాక్టర్‌కు ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని ఉంది. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాకపోవడంతో ట్రాక్టర్ కాలిపోయింది. ట్రాక్టర్ విలువ సుమారు రూ. 8 లక్షలు ఉంటుందని, బాధితుడు తెలిపాడు. ప్రస్తుతం వానాకాలం పంటల సీజన్ ప్రారంభం కాబోతుందని, ట్రాక్టర్ కాలిపోవడంతో తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 21 మే 2025



ఘనంగా హనుమత్ యజ్ఞం



సీసీసీ టౌన్ షిప్‌లోని హనుమాన్ ఆలయంలో యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

నస్పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీసీసీ టౌన్ షిప్ శ్రీరా మ భక్తాంజనేయ దేవాలయంలో మంగళవారం శ్రీరామ సహిత హను మత్ యజ్ఞంను ఆలయ కమిటీ, హ నుమాన్ భక్తసేవా బృందం ఆధ్వ ర్యంలో వైభవంగాంగా నిర్వహిం చారు. పండితులు దేవరాజు రంజిత్ శర్మ, ముస్త్యాల మహేష్ శర్మ, ము స్త్యాల కిషన్‌శర్మ, ముస్త్యాల హర్ష వర్ధన్ వర్మ, స్వయంభట్ల వరి శర్మ బృందంచే వేదమంత్రోచ్చారణల యజ్ఞ పూజ కార్యక్రమాలు జరిగాయి. పూజ కార్యక్రమానికి హజరైన భక్తులు స్వా మి వారిని దర్శించి తీర్థ ప్రసాదా లను స్వీకరించారు. అనంతరం స్వా ములకు బీక్ష, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నియామకం

బెల్లంపల్లి, మే20(ఆంధ్రజ్యోతి): మాదిగ హక్కుల దండోర బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడిగా కాంపెల్లి సతీస్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. మంగళవారం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మాదిగ హ క్కుల దండోర నియోజకవర్గ కార్య కర్తల సమావేశం నిర్వహించామని నూతన కమిటీని రాష్ట్ర జిల్లా కమిటీల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎనగందుల నరేశ్, ప్రధాన కార్యదర్శిగా కు మార్, ఉపాధ్యక్షులుగా మహేందర్, కార్యదర్శిగా శంకర్‌లు ఎన్నికయ్యారు.

భూ భారతి చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి

● అధికారులు తప్పుచేస్తే వదిలే సమస్యే లేదు ● రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



భీమారం సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మంచిర్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం తీసు కువచ్చిన భూ భారతి చట్టాన్ని అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలని, పేదలు, భూములున్నవారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకునే బాధ్యత అధికారులపై ఉందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమా చార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లాలోని భీమారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వ మని, ప్రజలు, సామాన్యులకు క్షేత్ర స్థాయిలో న్యాయం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి వల్ల అనేక మంది రైతులు, ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, తమ సమస్యలు ఎవరికి చెప్పు కోవాలో కూడా తెలియక ఆవేదన చెందారని మంత్రి అన్నా రు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ భారతి చట్టానికి రూపకల్పన చేసిం దన్నారు. ధరణిలో సాదాబైనామాల స మస్య లకు పరిష్కారం చూపలేదని, భూ భారతి చట్టంలో వాటి ని పరిగణలోకి తీసుకొని పరిష్కరించేవిధంగా చట్టాన్ని రూపొందించామన్నారు. భూభారతిలో భాగంగా మొదట రాష్ట్రంలోని నాలుగు మం డలాల ను పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని సమస్యలపై దర ఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఆయా మండ లాల్లో 2200ల దరఖాస్తులు రాగా, అందులో 1100ల వరకు సాదాబైనామాల సమస్యలే ఉన్నాయ న్నారు. ప్రభుత్వ స్థలాలను సాగు చేస్తున్న అర్హులకు జూన్ 2వ తేదీన రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సంద ర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు అంద జేస్తామని, ఈ విషయంలో పూర్తిస్థాయిలో స ర్వే జరపాలను వేదికపై ఉన్న కలెక్టర్ కుమార్ దీపక్ ను ఆదేశించారు. భూ భారతి చట్టంలో స్వీకరించిన దరఖాస్తు అధి కారులే పరిష్కరించాలని, అధికారులు తప్పు చేసి నట్లు తేలితే చర్య లు తీసుకునేవిధంగా చట్టంలో పొందుపర్చినట్లు చెప్పారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్‌ను కూడా పొందుపరిచి పాసుపుస్తకాలు జారీ చేస్తామన్నారు. రైతులు కార్యా లయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఎవరి కి కూడా లంచం ఇవ్వవద్దని సూచిం చారు. ధరణిలో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకొని అర్హులకు పంపిణీ చేస్తామని మంత్రి చెప్పారు. ఈ నెలాఖరు లోపు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రారంభి స్తామని, మొదటి విడతగా 4.5 లక్షల ఇళ్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇళ్ల ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ అవసరం మేరకు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందజేస్తామని ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సల హాదా రు హర్కర వేణుగోపాల్ రావు, చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్, గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి, కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సబావత్ మోతీ లాల్, డీసీపీ ఎగ్గడి భాస్కర్‌తో పాటు చెన్నూరు నియోజక వర్గంలోని తహశీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

● డీఈవో యాదయ్య



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న విద్యాధికారి యాదయ్య

మంచిర్యాలక్రైం, మే20 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ తరగ తుల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పాఠశాల ప్రగతి చక్రానికి రథసారథి లాంటివారని, పాఠశాలలో అందుబాటులో ఉన్న వివిధ రకాల వనరులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మకైన విద్యను అందించేలా కృషి చేయాలన్నారు. విద్యారులను అన్ని రంగాల్లో విజయవంతమయ్యేలా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల లో అమలవు తున్న అనేక కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని శిక్షణ కార్యక్రమంలో చర్చించే విషయాలను పాఠశాలల్లో చక్కగా అమలు చేయ డానికి తగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కోర్సు సెంటర్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, రిసోర్స్‌పర్సన్ వ్యవహరిస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, రాజు, పాల్గొన్నారు.

మోదీ చిత్రపటాన్ని దహనం చేయడం హేయమైన చర్య



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కాసిపేట, మే20 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటా నికి దహనం చేయడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం సోమగూడెంలో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కాం గ్రెస్ పార్టీ నాయకులు మోదీ చిత్రపటాన్ని దహనం చేసిన దుశ్చర్యను ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యకు పాల్పడినవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బెల్లంపల్లి ఏసీపీకి వినతిపత్రం అందజే శారు. మోదీ చిత్రపటాన్ని దహనం చేసి అపవిత్రం చేయడం పట్ల క్షీరాభి షేకంతో శుద్ధి చేస్తున్నామన్నారు. మోదీని అవమానించిన వారిని కఠిన శి క్షించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని యెడ ల జిల్లా వ్యాప్తంగా అందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి వెంకటకృష్ణ, పుల్లం తిరుపతి, కోయల్‌కర్ గోవర్ధన్, శ్రీకృష్ణదేవరాయలు, తోడి రమేశ్, రాచర్ల సంతోష్, కాసిపేట మండల అధ్యక్షులు సూరం సంపత్, గజెల్లి రాజుకుమార్, దార కళ్యాణి, భరత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మంచిర్యాలకలెక్టర్, మే20(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవ లంబిస్తున్న విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలి ఏఐటీయూసీ జి ల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మా నందం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహ నం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సంపద సృష్టిం చేది కార్మికులేనని, సహజ వనరులను వెలికి తీసి సంపదగా మార్చే కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తప్పనిసరిగా కృషి చేయాలన్నా రు. అలాంటి సంపద సృష్టించే కార్మికుల హక్కులను హరించే ప్రభు త్వా లకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. 44కార్మిక చట్టాలను 4కోడ్ లుగా మార్చి కార్మికవర్గానికి హక్కులు లేకుండా కేవలం కార్పొరేట్ వ్యాపార సంస్థలకే లాభం చేకూర్చడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జులై 9న విజయవంతం చేయాలని కార్మికవర్గాన్ని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్య క్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు ప్రకాశ్, పీయుసీఐ నాయకులు దేవ రాజ్, ఏఐటీయు సీ నాయకులు కలీందర్ అలీఖాన్, మిట్టపల్లి పౌలు, రవీం దర్, శ్రీనివాస్, రాములు, ప్రభాకర్, రాజేందర్, పోచమల్లు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

కాసిపేట, మే20 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట సాగు విధానం అధి క దిగుబడులు సాధించే వీలుగా రైతులకు శాస్త్రీయ పద్ధతిలో పంట వి ధానంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం ముత్యంపల్లి రైతు వే దికలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు ముంగిట్లో శా స్త్ర వేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి కృ షి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ వ్య వసాయరంగంలో నూతన యజమాన్య పద్ధతులను వివరించారు. అ నంత రం బెల్లంపల్లి వ్యవసాయ సంచాలకు రాజనరేంద్ర మాట్లాడుతూ రైతులు వరి, పత్తి పంటను మాత్రమే పండిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రియాస్‌గాంధీ, నాగరాజు, కాసిపేట మండల వ్యవసాయ అధి కారి ప్రభాకర్, ఏఈవోలు ప్రతిభ, రమ్య, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు

చెన్నూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం సరస్వతి పుష్కరాల్లో భక్తులను, సామా న్యులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం చెన్నూరు మండలం కిష్టంపేట వై జంక్షన్ వద్ద కోటపల్లి మండలం పారుపెల్లి సమీపంలోని జాతీయ రహదారిపై అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాను వెంటనే తొలగించాలని మంచిర్యాల ఆర్డీవోను ఫోన్‌లో విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలకు మాత్ర మే టోల్ వసూలు చేస్తామని చెప్పిన అటవీ అధికారులు ఇప్పుడు హైవేలపైన టోల్ వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. చెన్నూరుకు వచ్చే భక్తులు, సామాన్యులపై టోల్ పేరిట అటవీ శాఖ డబ్బులు వసూలు చేయడం సరైంది కాదన్నారు. దీన్ని వెంటనే విర మించుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులను ఇబ్బందులకు గురి చేయాలని అటవీ అధికారులు స్థానిక ఎమ్మెల్యే వివేక్ చేతుల మీదుగా ఈ టోల్‌గేట్లను ప్రారంభించారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ టోల్ వసూళ్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

లేబర్‌కోడ్‌ల రద్దు కోసం నిరసన చేపట్టండి

బెల్లంపల్లి, మే20 (ఆంధ్రజ్యోతి): లేబర్‌కోడ్‌ల రద్దు కోసం నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నా యకులు అన్నారు. మంగళవారం శాంతిఖనిగని లాంగ్‌వాల్ ప్రాజెక్టు కా ర్మికులతో మాట్లాడారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వాయిదా వేయ డం సరైంది కాదన్నారు. కార్మికులకు అన్యాయం చేసే విధంగా ఉన్న లేబర్‌కోడ్‌లను రద్దు చేసేంత వరకు కార్మిక సంఘాలు ఐక్యతగా పోరా డాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరటి రాజన్న, చాంద్‌పాషా, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



జైపూర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

జైపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసమే ఉపాధ్యా యులకు శిక్షణ శిబిరాలను ప్రారంభించామని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. రైజింగ్ తె లంగాణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధనపై ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని మంగళవారం జైపూర్ కేజీబీవీ పాఠశాలలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విద్యార్థి అభ్యాసన స్థాయిలను మెరుగు పర్చడం కోసం కనీస సామర్థ్యాలైన చద వడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయడం, పరిసరాల విజ్ఞానంపై అవగాహన పెం పొందించుకోవడానికే ఈ శిక్షణ అన్నా రు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ తిరుమలేష్, పోశెట్టి, రాజేందర్, ఎంఎన్‌వీలు లలిత, కవిత, రజిత, హైమావతి, రజిత, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రభు త్వపాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు ప్రత్యేక శిక్షణ తరగతులను ఎంఈవో శైలజ ప్రారం భించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయు లకు మౌలిక భాష గణిత సాధన కోసమై ఐదు రోజుల పాటు శిక్షణ అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవోతో పాటు మండల రిసోర్స్ పర్సన్ పింగిళి వేణుగోపాల్, బండ శ్రీనివాస్, తిరుపతి, నరేందుల శ్రీనివాస్, బుర్ర గిరిధర్, రవీందర్, చంద్రశేఖర్‌తో పాటు సీఆర్‌పీలు పాల్గొన్నారు.

తాండూర్ : తాండూర్‌లోని విద్యాభారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ అంశం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణి శిక్షణ లక్ష్యాలను వివరిం చారు. ప్రతి ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా ఈ శిక్షణ ఈనెల 24వరకు ఉంటుందని ఎంఈవో మల్లేశం తెలిపారు. డీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా ఎండు మిర్చి అమ్మకాలు

దండేపల్లి, మే20(ఆంధ్రజ్యో తి): మండలంలో ఎండుమిర్చి అమ్మకాలు జోరందుకున్నాయి. దండేపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో జరిగే వారసంతలలో ఎండుమిర్చి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతల నుంచి ఎండు మిర్చిని వ్యాపారు లు కొనుగోలు చేసి వాటిని వారసంతతో పాటు, ఆటోల్లో నింపు కోని గ్రామాలు తిరుగుతూ వాడ వాడ విక్రయిస్తున్నారు. వేసవికాలంలో మామిడి పచ్చళ్ల తయారీకి మిరప పొడి అవసరం. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఎక్కువ శాతం ఎండు మిర్చిని కొనుగోలు చేసి గిర్నీల్లో పట్టించి పెట్టుకుంటారు. దండేపల్లి మండల కేంద్రంలో ఎండు మిర్చి కిలోకు రూ.130 నుంచి 240 వరకు అమ్మకాలు చేపడుతున్నారు.



దండేపల్లిలో ఎండుమిర్చిని కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా ఇసుక రవాణా



లక్ష్మీకాంతపూర్ గోదావరి నుంచి ఇసుక తీసుకవచ్చి డంప్ చేస్తున్న ట్రాక్టర్

దండేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు ఎండలు ముదురుతున్నాయి. మ రోవైపు అత్యధిక ఊష్ణోగ్రతలకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. కానీ ఇసుక అక్రమ వ్యాపారులు మాత్రం ఆగడం లేదు. అడ్డూ అదుపు లేకుండా అ నుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తూ నే ఉన్నారు. నిత్యం గోదావరి తీరం నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా అక్ర మంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు. మండలంలోని లక్ష్మీకాంతపూర్‌లో గోదావరి నదీ తీర ప్రాంతాల నుంచి ఇష్టారీతిగా ఇసుక తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొందరు రాత్రి ట్రాక్టర్ ద్వారా ఇసుకను నింపుకోని రహస్య ప్రదేశాలలో ఇసుక ను నిల్వ చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట ఇసుకను తరలిస్తున్నా సంబంధి త శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి గోదావరి నదిలో తవ్వాకాలను అరిక ట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు

గోదావరి తీరాల నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటాం. ఎవరైన ఇంటి అసరాలకు ఇసుక అవసరం ఉంటే అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే వాహనలు సీజ్ చేస్తామన్నారు.

- దండేపల్లి డిప్యూటీ తహసీల్దార్ విజయ

కానరాని తునికాకు సేకరణ

● ఉపాధి కోల్పోతున్న ఆదివాసీలు

కాసిపేట, మే20(ఆంధ్రజ్యోతి): బీడీలకు ఉపయోగించే తునికాకు సేకరణ జిల్లాలో కనుమరుగవుతోంది. బీడీలు తాగే వారి సంఖ్య జిల్లాలో గణనీయంగా తగ్గింది. జిల్లాలో నాలుగు అటవీ డివిజన్‌లు ఉండగా జన్నారం అటవీ డివిజన్, కవ్వాల అభయారణ్యం పులుల కు ఆవా సమైంది. ఇక్కడ తునికాకు సేకరణ కాదు కదా అక్కడి నుంచి గడ్డి పోచకూడ బయటకు తీసుకపోవడానికి వీలులేకుండా పోయింది. మిగితా మూడుడివిజన్లు చెన్నూర్, మంచిర్యాల, బెల్లం పల్లి అటవీ డివిజన్‌లో తునికాకు సేకరణకు టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు ఎవరు కూడ ఆసక్తి చూపకపోవడంతో ఆకుల కల్లాలు లేక గ్రామాల్లో వెల వెల బోతున్నాయి. తునికాకు సేకరణ ఉనికికి ముప్పు వాటిల్లనుంది. వేసవిలో తునికాకు సేకరణ ద్వారా ఉపాధి పొందే ఆదివాసీలు ఆకు సేకరణ లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. వేసవికాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక పట్టణా లకు వలస వెళ్లి అడ్డ కూలీలుగా పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి ఆదివాసీలను ఆదుకోవాలని సంఘాలు కోరుతున్నాయి.

జిల్లాలో 9యూనిట్లలో ఆకుసేకరణ...

గతంలో జిల్లాలో తునికాకు సేకరణ 40యూనిట్ల కుపైగా ఆకుసే కరణ జరిగేది కానీ మూడేళ్లుగా తునికాకు సేకరణ సరిగ్గా జరగడం



తునికాకు సేకరిస్తున్న మహిళ (ఫైల్)

లేదు. గత ఏడాది మంచిర్యాల అటవీ డివిజన్‌లో ఆవడం, జైపూర్, మద్దికల్ యూనిట్లు నిర్వహించి 2700 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ లక్ష్యం విధిస్తే 2603 స్టాండర్డ్ బ్యాగులతోనే సరిపెట్టారు. అలాగే చెన్నూర్ అటవీ డివిజన్‌లో కన్నెపల్లి, బద్దంపల్లి, మైలారం, నీల్వాయి యూనిట్లకు 9300 స్టాండర్డు బ్యాగుల లక్ష్యం నిర్దేశించగా 9240స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ జరిగింది. బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో నార్వాయిపేట, కుశ్న పల్లి, వేమ నపల్లి యూనిట్లకు 600వేల స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇక్కడ 7564 స్టాండర్డ్ బ్యాగులు సేకరించి లక్ష్యాన్ని అధిగమించారు. ఈఏడాది మంచిర్యాల డివిజన్‌లో హాజీ పూర్, ఆవడం యూనిట్లకు 1800 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యాన్ని విధించారు. చెన్నూర్ డివిజన్‌లో భీమారం, కన్నెపల్లి, వెంచపల్లి, మైలారం, నీల్వాయి యూనిట్లకు 8900లక్ష్యం నిర్దేశించారు. బెల్లంపల్లి అటవిడివిజన్ పరిధిలో కుశ్నపల్లి, వేమనపల్లి యూనిట్లకు 4400 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యాన్ని నిర్దేశిం చారు. ఈ ఏ డాది లక్ష్యాన్ని సాధిస్తారో వేచి చూడాల్సిందే.

ఉపాధి లేక ఆదివాసీల ఇక్కట్లు...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవులకు క్షేత్రం. ఆదివాసీలకు నిల యం. ఏ సీజన్‌లోనైన అటవీ ఉత్పత్తుల పై ఆధారపడి జీవించే ఆది వాసీలకు తునికాకు సేకరణ జిల్లాలో ప్రధాన ఆదాయ వనరు. కాని నేడు బహుళ జాతి కంపెనీలు అందుబాటులోకి..

మిగతా 7లో